572) దేవగాంధారి

ప॥ నమ్మితి జుమ్మీ వో మనసా నాకే హితవై మెలంగుమీ।
ముమ్మాటికి నేజెప్పితి జుమ్మీ మురహరు నామమే జపించుమీ॥

చ॥ తలచకుమీ యితర ధర్మములు తత్త్వజ్ఞానము మఱవకుమీ।
కలగకుమీ యేపనికైనను కడు శాంతంబున నుండుమీ।
వలవకుమీ వనితల కెప్పుడు వైరాగ్యంబున నుండుమీ।
కొలువకుమీ యితర దైవముల గోవిందునినే భజించుమీ॥

చ॥ కోరకుమీ దేహ భోగములు గొనకొని తపమే చేకొనుమీ।
మీరకుమీ గురువుల యానతి మెఱయ బురాణములే వినుమీ।
చేరకుమీ దుర్జన సంగతి జితేంద్రియుడవై నిలువుమీ।
దూరకుమీ కర్మఫలంబును ధ్రువవరదునినే నుతించుమీ॥

చ॥ వెఱవకుమీ పుట్టుగులకు మరి వివేకించి ధీరుడవగుమీ।
మఱవకుమీ యలమేలమంగకు మగడగు శ్రీవేంకటపతిని।
కెఱలకుమీ మాయారతులను కేవల సాత్వికుడవు గమ్మీ।
తొఱవకుమీ నేరములకు సింధు రక్షకునినె సేవించుమీ॥